# 24. జూదరి

మూడు రోజుల్నుంచి శంకరం ముఖంలో అర్థంకాని ఆవేదన ఏదో స్పష్టంగా కనిపిస్తూ వుంది. దుస్తుల్లోనూ, శుభ్రతలోనూ, ప్రవర్తనలోనూ శ్రద్ధయేమీ కనిపించటం లేదు. సంభాషణలో చాలా అన్యమనస్కంగా ఉంటున్నాడు. అసలు క్లబ్బులోకివొచ్చి ఎవర్నీ పలకరించకుండానే, ఒక మూలజేరి ఒంటరిగా కూర్చొని తనకు అందని విషయాన్ని గూర్చిన ఆలోచనతో బాధపడుతున్నట్టు తోస్తుంది. చీట్లపేక అంటే చెవికోసుకొనే శంకరంలో యీమార్పు రావటం నాకు నిజంగా ఆశ్చర్యం కలిగించింది. నాలుగైదుసార్లు హెచ్చరించి చూశాను కాని, "ఏం లేదు బ్రదర్!" అని దూసుకు పొయ్యేందుకు ప్రయత్నించాడు.

ఒకటికి రెండు రోజులు గడిచినా వాడి స్థితి మారలేదు. సంగతేమిటో తెలుసుకోవాలనే కుతూహలమూ, స్నేహితుడు ఏదో గొప్పసమస్యతో వేగిపోతున్నాడనే బాధా, ఆ బాధకు ఏదైనా దారిదొరుకుతుందేమో చూద్దామనే అభిలాషా నాలో నానాటికీ పెరగ జొచ్చినయ్. అందులోనూ నేనంటే పడిచచ్చే మిత్రుడి యోగక్షేమాల్ని విచారించాల్సిన నా బాధ్యత నన్ను మరీ తొందర పెట్టసాగింది.

"ఎంతచెడ్డా స్నేహితుణ్ణి. నీ హృదయంలోది ఎంత గొప్ప వ్యక్తిగత జీవిత రహస్యమైనా నీలో నువ్వు ఇలా కుమిలిపోవటంవల్ల లాభం లేదు. ఇతరులకు చెప్పుకోవటంవల్ల కొంత హృదయభారం తగ్గుతుంది. నీ బుద్ధికి అందని దారికూడా దొరకవచ్చు" అన్నాను- యీ ముసుగులో గుద్దులాట వ్యవహారంతో తలవాచి.

ఆ చీకట్లోకి లాక్కుపోయి కూర్చోబెట్టి "నీతో చెప్పాలనే వుందికాని, ఒకవిధంగా మనస్కరించటం లేదు" అన్నాడు.

"ఎందుకనీ? నన్ను నమ్మలేవా?"

"అదికాదు. విషయాన్ని- నా హృదయారాటాన్ని నీకు బాగా అర్థమయ్యేట్టు చెప్పగలనా అని నా అనుమానం. చెప్పాక నువ్వు ఎగతాళిగా నవ్వుతావేమోననే భయమూను!"

"స్నేహితుడు కష్టదశలో ఉండగాచూసి నవ్వేవాడు స్నేహితుడు మాత్రం కాడు. రాక్షసుడు!"

క్షణంసేపు నా ముఖంలోకి చూసి "నిజమేననుకో ! ఇతరులకు బాధ కలిగించకుండా, రెండో సహాయం లేకుండా యీ సమస్యను నా అంత నేనుగానే తీర్చుకుందామనుకున్నా కాని, సాధ్యపడలేదు. ఇది ఇంకో సహాయంకోసం అర్థించాల్సిన సమయమని కూడా తోస్తోంది."

"డబ్బు విషయం కాదుకదా?"

"కాదులే. ఐనా సంభాషణ మొదలుపెట్టగానే ప్రతివాడూ నీ పర్స్‌మీదనే కన్నుంచి మాట్లాడుతూన్న అనుమానం నీకు ఎందుకు కలుగుతుందో అర్థమవటంలేదు. ఎప్పుడూ ఇంతే!" అని ముఖం ముడుచుకున్నాడు.

"లేదులేరా బాబూ! యీ రోజుల్లో ఆర్థికసమస్య అంటే కాస్త భయంగా ఉండి అలా అన్నాను." అసలు సమస్యలో లేని కొత్తబాధ యీ ఉపసమస్యలో రావటం హాస్యాస్పదం!

"సంగతి తేల్చు. నీకు పుణ్యం వుంటుంది" అని ఒక విధంగా ప్రార్థనాపూర్వక స్వరంలోనే అన్నాను.

పుణ్యంగొడవ వాడికి పట్టదని నాకు తెలుసు. ఐనా వెంటనే ప్రసన్నుడయ్యాడు. "తేల్చేందుకు ఏముందిలే. నా భార్య విషయం" అని ఆగాడు.

కథ చాలా గొప్ప సస్పెన్స్‌లో నిలిచిపోయింది. ఏ విషయం మీదనైనాసరే ఏదో వొకటి వాగెయ్యవొచ్చు లేదా ఏదో ఒక విధంగా ఆలోచించవొచ్చు. కానీ "స్నేహితుడిభార్య" విషయంలో మాత్రం పెదవి కదిల్చే హక్కూ అధికారమూ లేకపోను, విరోధానికి దగ్గరిగా జేరకుండా నోరు విప్పేదాకా తప్పనిసరిగా ఊపిరి బిగపట్టుకొని కూర్చోవాల్సి వొచ్చింది.

నా నిశ్శబ్దతలోని సిన్సియారిటీని గ్రహించినవాడల్లే వెంటనే మాట్లాడటం మొదలుపెట్టి నాకూ (తరువాత మీక్కూడా!) చాలాశ్రమనూ, ఆందోళననూ తప్పించినందుకు మనసులో వాడికి అనేక ధన్యవాదాలు (మీ తరఫునకూడా, అర్పించుకున్నాను.

"నాలుగునెలల క్రితం నా ఉద్యోగం పోయిందని మీ అందరికీ తెలుసుగా! ఆ సంగతి నా భార్యకు మాత్రం తెలియదు!"

"ఈ శుభవార్తను ఆమెకు ఎలా అందజెయ్యాలా అని చూస్తున్నావా యేం? కావాలంటే నేనే స్వయంగా వొచ్చి చెప్తాను."

"గొప్పపని చేస్తావ్! పోయింది నా ఉద్యోగం కనుక ఆ వార్తను మోసెయ్యటం నీకు బహుతేలిక!"

"ఉద్యోగం పోయినందుకు ఇంత బాధపడుతున్నావనుకోలేదు."

"నాకేం బాధలేదు. బాధపడటంవల్ల ప్రయోజనమూ లేదు. ఇంకో ఉద్యోగం వొచ్చేసూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. అది రాగానే కాస్తోకూస్తో మిగిలివున్న యీ బాధను పూర్తిగా వొదిలించుకోవొచ్చు."

"ఇప్పుడిక సమస్య ఏముందీ?"

"ఈ నాలుగు నెలలూ ఎలా గడిచినయ్యనీ? మానాన్న నన్ను సోమరిగా ఉంచకుండా ఉండేందుకూ, ఇండియా ప్రభుత్వం పన్ను అనే మిషమీద నాజేబు తడవకుండా ఉండేందుకూ బాగా ఆలోచించి, సెంటుభూమీ దమ్మిడీ క్యాషు కూడా మిగల్చకుండానే పోయారు. సరే... మొదటినెలంతా క్లబ్బులో చీట్లపేకసెక్షన్ పోషించింది. కాని రెండో నెల నుంచీ రాబట్టుకున్న దానికన్న రెట్టింపుపిండే ప్రయత్నానికి పునాదివేసిందని తెలియలేదు. అసలు ఉద్యోగం పోనేపోయింది. ఇక యీ ఉద్యోగానికన్నా దిగుదామనే మూఢ నమ్మకం కూడా నాలో బాగా పనిచేసింది. కొంత పెట్టుబడి కావల్సివొచ్చింది. భార్యను ఏడిపించి మెల్లిగా ఆమె మెడలోని బంగారుగొలుసు తీసుకొన్నాను. ఆ గొలుసు నాలుగు పేటలది. ఆమె పుట్టింటివారు ఇచ్చింది. ఆమె మెడలో మెరుస్తూవుండేది. దాన్ని ఏవిధంగానూ దుర్వినియోగం చెయ్యకూడదనే నిశ్చయం లోపలవుంది కాని, అంతకన్న, గత్యంతరం లేకపోయింది. అదీకాక, నేను ఆ డబ్బుతో వ్యాపారం సాగించి ఒకటికి రెండు గొలుసులు చేయిద్దామని కూడా ఆశపడ్డాను.. ఆమె ఇచ్చేప్పుడు గంపెడు అనుమానంతో పెద్ద పోట్లాట జరిగాక కాని ఇవ్వలేదు. నా ఉద్యోగం పొయ్యే పరిస్థితి ఏర్పడ్డదనీ (నిజానికి ఉద్యోగం పోయింది, కొత్త ఉద్యోగాన్ని మొదలుపెట్టేందుకే ఈ అవస్థ!) మళ్ళీ రెండు వారాల్లో గొలుసుతెచ్చి ఇచ్చేస్తాననీ, ప్రమాణాలు చేసి ఎలాగో ఆమెను కరిగించి తీసుకొచ్చాను. ఆ గొలుసును తాకట్టుపెట్టి ఆ డబ్బును మన క్లబ్బులోని చీట్లపేక ఆఫీసుసభ్యులకు పంచిపెట్టేశాను. అనుకున్నదానికన్న త్వరలోనే, చకచకా పనులు ఐపోవటం వల్ల, వెంటనే యీ ఉద్యోగంలోంచి బైటపడ్డాను."

"క్షవరకల్యాణమై!" అని పూర్తిచేశాను.

"కనుకనే ఇన్నాళ్ళూ మళ్ళీ దానిజోలి ఎత్తకుండా ఉండగలిగాను!"

"ఇప్పుడు మళ్ళీ కొత్తప్రవేశానికి ప్రయత్నిస్తున్నావా?"

"ఇంకానా? బాగా బుద్ధొచ్చింది! జీవితంలో ఇకముందు యీ పాడుజూదం ఆడకూడదని పెద్ద ఒట్టు పెట్టుకున్నాను."

"ఇంకేముందీ? నిర్విచారంగా నిద్రపో!"

"పేకాట గొడవ నాకేం పట్టిందీ. అసలు సమస్య నా భార్యతో..."

"అన్నట్టు మరిచిపొయ్యాను. చెప్పు."

"నిర్ణీత కాలానికి గొలుసు ఎప్పుడైతే రాలేదో ఆమె అనుమానం హెచ్చయింది. రోజులు గడిచినకొద్దీ ఓర్పు కూడా తగ్గటం మొదలుపెట్టింది. మొదట్లో 'ఇదుగో! అదుగో!' అని వాయిదాలువేస్తూ ఎలాగో సర్దిచెప్పేవాణ్ణి. కాని నా మాటలన్నీ నీళ్ళలోని మూటలని గ్రహించేందుకు ఆమెకు ఎక్కువ కాలం పట్టలేదు. ఇక లాభంలేదని ఆమె పోట్లాడటం మొదలుపెట్టింది. రోజూ ఇంటికిపోగానే గొలుసు సంగతి ఎత్తి ఘోరంగా పోట్లాడేది. నేనుకూడా లేని కోపాన్ని నటిస్తూ, గంభీరంగా దబాయించేవాణ్ణి. తన చేతకానితనాన్ని పెద్దగా ఏడుస్తూ బైటపెట్టడం నాకు భరించశక్యం కాకుండా పోయింది. ఈ పరిస్థితిలో ఉద్యోగంకూడా ఊడిందనే విషయాన్ని చెప్తే నా స్థితి మరీ ప్రమాదంలో పడుతుంది. ఉద్యోగంలేని భర్తనుచూస్తే ఏ భార్య గౌరవిస్తుందీ?"

"ఆ గొలుసు నేను తెచ్చి ఇవ్వలేను. నన్నెందుకు చంపుతావు? అని ఖచ్చితంగా చెప్పేసెయ్!"

"ఆమె వినే స్థితిలో లేదు. నేను తెచ్చిఇవ్వగలననీ, కాని టలాయిస్తున్నాననీ, ఎలాగైనా ఆశవదలకుండా పట్టుబడితేనే కాని నేను తేననీ ఆమె అపోహపడుతోంది. నా అసమర్థతను మాత్రం నమ్మేందుకు నిరాకరిస్తుంది..."

"ఇలాగే మరికొన్నిరోజులు సాగితే యీ ఉన్న ఆశ అడుగంటుతుంది, అప్పుడిక నమ్మక తప్పేదికూడా ఉండదు."

"అంతా వినకుండానే సలహా లివ్వమాక. ఐదారు రోజుల్నుంచీ ఆమె నిమోనియాతో మంచ మెక్కింది. డాక్టర్ శాస్త్రి చికిత్స చేస్తున్నాడు. బతికే ఆశలు బహుకొద్ది అని చెప్పాడు. అత్తగారూ, మామగారూ, మరదలూ కూడా వొచ్చారు. నిరాశతో వాళ్ళంతా కంటతడిపెడుతూవుంటే, నాక్కూడా బావుర్న ఏడవాలనిపిస్తూ వుంటుంది. ఆ ఇల్లొక యమలోకంగావుంది. అందులోనూ ఫిట్సుకూడా ఆరంభమైనవి. పాడువ్యాధి ఆమెను బతకనివ్వటమూ లేదు, చావనివ్వటమూ లేదు. యీ వ్యాధితో బాధపడుతూ కూడా నేను ఇంట్లో కాలుపెట్టటం తడవుగా 'ఏమండీ! గొలుసు తెచ్చారా?' అని మొదలుపెడుతుంది. అంతవరకూ శ్వాస ఆడక బాధపడుతూ, బలహీనతతో మాట్లాడే శక్తిలేకుండా పడివుండి, నేను పోగానే ఎగిరి మీదికి దూకుతూన్నట్లు ఇంటి

కప్పు ఎగిరిపొయ్యే కంఠధ్వనితో అలా నిలవదీసి అడుగుతూంటే నిలువునా నీరైపోతున్నాను. ఆ గొలుసు నిజచరిత్ర మిగతా వాళ్ళకు సరిగ్గా తెలియకపోయినా, అదేదో అతివిచిత్ర సంఘటన ఐనట్టూ, ఆ తప్పంతా నాదేనన్నట్టూ, అసలు ఆమెను యీ స్థితికి లాగింది ఆ గొలుసేనన్నట్టూ నా వైపు అనుమానంగా, ఒక ఖూనికోరును చూసే ఏవగింపు చూపులతో చూస్తున్నారు. ఇంట్లో ఉన్నంతసేపూ గొలుసుబాధ. యీ బాధ పడలేక అందరూ వెళ్ళే దాకా క్లబ్బులోనే కూర్చుంటున్నాను. కాని మరణావస్థలో 2వున్న భార్యను ఎలా మరిచిపోయ్యేదీ? దగ్గర్లోనే ఉండి భార్య మృతశయ్యదగ్గర లేకపోతే రేపు లోకులు నా దుర్మార్గాన్ని బుర్రకథలుగా చెప్పుకుంటారనే భయం కూడా వుంది. పోనీ యీలోపుగా దాని ప్రాణి పోయిందేమో సగం బెడద వొదులుతుందని, ఏ అర్ధరాత్రో ఇంటికి వెళ్తే, అంతకు క్రితం కింద దింపిన ఆమె బొందిలోకి నిజంగానే పోయిన ప్రాణి తుఫానులాగా వొచ్చిపడుతుంది. వెంటనే గొలుసు విషయం మొదలు. నేను ఆమెను ప్రేమించి పూజిస్తూ గౌరవించిన సంఘటనలుకానీ, ఆమెకు చేసిన ఉపకారాలుకానీ ఏవీ జ్ఞాపకంలేవు. నేను చేసిన ఒక్క అపకారమూ- వెధవగొలుసును తీసుకువెళ్ళిన సంఘటన వొక్కటే ఆమెకు అంత్యక్షణాల్లోకూడా బాగా జ్ఞాపకం వుందంటే నిజంగా ఆశ్చర్యంగానే వుంది! మరీ రెండు రోజుల్నుంచీ ఆమె కంఠధ్వనిలో బాగా మార్పు వొచ్చింది. ఆరోగ్యం బాగా క్షీణించటం వల్లనేనేమో? పాలిపోయిన ముఖంలో నుంచి కాంతిహీనమైన కళ్ళు తెరిచి, దీనంగా, జాలిగా బాధగా నా వైపు చూస్తూ 'గొలుసు తెచ్చారా?' అని అడుగుతుంది. పూర్వంలాగు దబాయించి అడిగినప్పటికన్న, ఇలా అర్థించే కంఠధ్వని నన్ను మరీ బాధపెట్టసాగింది. మరదలు పిల్లకూడా ఇక ఆగలేక 'బావా! ఏం గొలుసూ?' అని మొదలుపెట్టింది. ఏం జవాబు చెప్పేదీ? ఆమెమాత్రం ఆ గొలుసు చూడందే ప్రాణం విడవదనే నమ్మకం నాకు దృఢంగా ఏర్పడ్డది. ఒకవేళ గొలుసు చూడకుండానే ప్రాణం పోతే మాత్రం దయ్యమై ఆ గొలుసు కోసం నా ప్రాణం తియ్యక మానదు! గొలుసు చూసేవరకూ దాని ప్రాణి అలా కొట్టుకులాడుతూవుంటే ఏం చెయ్యాలో తోచక చస్తున్నాను."

శంకరం చెప్పిందంతా కళ్ళముందు కట్టినట్టుగా వుంది. క్షీణదశలోవున్న రోగి ఆకృతీ, ఆ మంచంచుట్టూ జేరిన ఆత్మబంధువుల నిరాశావిలాపాలూ, ఆరాటమూ, ఆవేదనా, ప్రాణం ఆమె గొంతుకలో కొట్టుకులాడటమూ, వీడు మెల్లిగా దొంగతనంగా వంటింట్లో ప్రవేశించే పిల్లిలాగు ఇంట్లోకి వెళ్ళటమూ, ఆమె ఆశ మళ్ళీ రేగి వీణ్ని దీనంగా గొలుసు అడగటమూ, వీడు నీరైపోవటమూ, వీడి అవస్థ తేలిగ్గా గ్రహించు కున్నాను. ఏం సలహా ఇచ్చేట్టూ?

"ఒక్కసారి ఆ గొలుసును ఆమెకు చూపితేచాలు. హాయిగా ప్రాణం వొదులు తుంది. చావబొయ్యే ముందు కూడా యీ వింతకోర్కె యేమిటో నాకు అర్థంకావటం లేదు." కన్నీరు ఒక్కటే తడవుగా పాలిపోయిన వాడి ముఖకళను నేను

భరించలేకపొయ్యాను. అందులోనూ మరణావస్థలోవున్న భార్య స్వల్పకోరికను తీర్చలేని అసమర్థుడి అవస్థ!

"ఒక్కసారి ఆ గొలుసు తీసుకువెళ్ళు."

"ఎట్లా? మూడు వందలరూపాయిలకు తాకట్టులో వుంది. అది విడిపించి తీసుకువెళ్ళి ఆమెకు చూపితే- ఆ తరువాత ఒకటి రెండు రోజుల్లో గొలుసు అమ్మెయ్యొచ్చు."

శంకరానికి సహాయం చేసితీరాలనే నా ఆత్మబోధ వృథాపోలేదు. ఆరు నెలల స్నేహమే అయినా, నెలతిరక్కుండానే అది 'అరేయ్' 'ఒరేయ్' మెట్టుదగ్గరకు వొచ్చింది. ఇంతత్వరగా అభివృద్ధి చెందిన స్నేహాన్ని రుచిమరిగాక, వొదలటం బహుకష్టం. అందులోనూ నేనంటే ఎంతో అభిమానంగా ఉంటాడు! వాడికి ఆస్తి యేమీలేదని వాడే చెప్తున్నాడు, ఐతేమాత్రమేం? మా క్లబ్బుస్నేహాన్ని క్లబ్బుస్నేహంగానే కాకుండా వేరొక రూపంలో దాన్ని బంధించాల్సిన అవసరం ఎప్పటికైనా తప్పదు. ఇప్పుడు వాడి దీనస్థితి నా జాలిగుండెను కరిగించింది. యీ సమయంలోనే స్నేహం విలువను చూపించుకోవటం మంచిది. అదీకాక పైకాన్ని రెండు రోజులపాటు అడ్డంగా పెడితే చాలు. రెండు ప్రాణుల సమస్యను తీర్చినట్టే ! మొదటిప్రాణి ఈ జీవితపు ఆవలిగట్టు ప్రయాణాన్ని వెంటనే సాగిస్తుంది. రెండో ప్రాణి కల్మషాత్మ పెట్టే బాధనుంచి దూసుకుంటుంది. శంకరం ఎవరైతేనేం? తోటిమానవుడు, స్నేహితుడు. వాడు నానుంచి సానుభూతిని కోరేందుకు యీ రెండు కారణాలే చాలు.

"ఆ పైకం నేను ఇస్తాను, కాని నువ్వు రెండురోజుల్లో సర్దెయ్యాలి. ఎందుకంటే అది ఇతరులెవరో నా దగ్గర దాచుకున్నారు. ఏ క్షణాన్నయినా దాన్ని తిరిగి ఇచ్చెయ్యాల్సిన బాధ్యత నాకు వుంది. తెలిసిందా?" అన్నాను.

వాడు కృతజ్ఞతాపూర్వకంగా నాకళ్ళల్లోకిచూసి అన్నాడు. "ఇంత క్లిష్టపరిస్థితిలో సహాయపడ్డవాణ్ణి స్నేహితుడుగా చూసుకోలేను. దైవంగానే చూసుకుంటాను. గొలుసుచూడగానే ఆమె హాయిగా ప్రాణంవిడుస్తుంది. వెంటనే గొలుసు అమ్మి నీపైకం తెచ్చి ఇస్తాను. నీ మేలును మాత్రం యీ జన్మకు మరువను."

వాడికి పైకంఇచ్చి ఓదార్పుమాటలతో ధైర్యంచెప్పి సాగనంపాను.

## 2

నాలుగు రోజులు గడిచినా శంకరం అంతులేదు. పాపం వాడి భార్యకు ఎలావుందో? గొలుసుచూసింది మొదలూ ఆరోగ్యాన్ని పుంజుకుంటూ వుందేమో! ఇదే నిజమైతే, రెండోసారి ఆమె శంకరానికి గొలుసు ఇవ్వదు. శంకరం

అప్పుగాతీసుకున్న పైకం మళ్ళీ తిరిగి రానూ రాదు. వెధవ డబ్బు పోతేమాత్రమేంలే వాడు రెండో పెళ్ళికోసం శ్రమ పడకుండా వుంటే అదేచాలు! లేక గొలుసు వేసుకొనే ప్రాణాన్ని వొదిలిందేమో? ఊహించి లాభంలేదు. పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలం పెరగజొచ్చింది. వాడి ఇల్లు ఎక్కడోకూడా నాకు తెలియదు.

డాక్టర్ శాస్త్రి చికిత్సచేస్తున్నాడని వాడన్నమాట చప్పున గుర్తొచ్చింది. సాయంత్రం డాక్టర్ కనిపించగానే అవతలికి పిలిచి "శంకరం భార్యకు ఎలా వుందీ?" అని అడిగాను.

"ఏ శంకరం?" అన్నాడు శాస్త్రి.

"మన శంకరమే! చిత్తూరునుంచి ట్రాన్స్‌ఫరై కలక్టరాఫీసుకు గుమాస్తాగా వొచ్చాడే... ఆరు నెల్ల క్రింద ఉద్యోగం ఊడిందే?... ఆ చీట్లపేక సెక్షన్‌లో గంటల తరబడి కూర్చుంటాడే.... జ్ఞాపకంరాలా?"

"చిత్తూరు శంకరమా! వాడి పెళ్ళానికా? ఏం?"

"నిమోనియాటగా! నువ్వు చికిత్స చేస్తున్నావటగా?"

శాస్త్రి పెద్దగానవ్వి "వాడి పెళ్ళానికి ఏ రోగమూ వొచ్చేందుకు వీల్లేదు!" అన్నాడు.

"ఆమె మానవమాత్రురాలుకాదనా?" అన్నాను.

"అది కాదు... వాడి కసలు పెళ్ళామేలేదు. ఇంతవరకూపుట్టి వీడికోసం సిద్ధంగా వుందోలేదో కూడా అనుమానమే. ఒకవేళ నువ్వన్న నిమోనియా వాడిపెళ్ళానికై ఉండదు. వాడికే ఐ ఉండాలి."

నా గుండె కొట్టుకోవటం ఆగిందేమో ననిపించింది. య్యీ వెధవ ఎంతపెద్ద అబద్ధమాడాడు! డబ్బు కోసం పెళ్ళి చేసుకున్నాడు. డబ్బుకోసం భార్య గొలుసు తీసుకున్నాడు. దాన్ని జూదంలో ఓడాడు. గొలుసు పొయ్యాక భార్యదేని కనుకొని, ఆమెకు నిమోనియా తెప్పించాడు, చివరకు ఆమెను చంపేందుకు నా దగ్గర మూడొందలు భరణంగాకూడా తీసుకున్నాడు. ఏమైనా, ఆ రోగిష్టి మంచమూ, చుట్టూజేరిన రోగి ఆత్మబంధువుల ఆవేదనా, చిన్నపాముపిల్లలాటి గొలుసు ఆమె కళ్ళముందు ఆడితేనే కాని పోనని పట్టుబట్టిన ఆమె మొండిప్రాణి ఆరాటమూ, ఇవన్నీ నా కళ్ళముందునుంచి ఇంకాపోలేదు. శంకరం యీవిషయాల్ని నామీద ఎంత గొప్పగా, బాగా రుద్దగలిగాడంటే డాక్టర్ మాటల్ని అనుమానించటమేకాక, ఒకవేళ అవి నిజమైనా కనీసం ఒక సంవత్సరం పాటైనా ఆ దృశాన్ని మరిచిపోలేను!

ఎదుటవున్న డాక్టర్ మాటలతో నా ముఖం వెలవెలబోయింది. దృష్టిపథంలో లేని ఆ శంకరంగాడి మీద కోపంతో ముఖమంతా ఎర్రబడేందుకు సిద్ధంగావుంది. విరుద్ధజాతికి చెందిన రెండు ఫీలింగ్స్ ఒకదాని వెంటనే వేరొకటి రావటంవల్ల ఆ ధాటికి చప్పున తట్టుకోలేకపొయ్యాను. ఎందుకోగాని గట్టిగా నేలమీద తన్నాను.

ఆ ఫీలింగ్స్ తనవి కాకపోయినా, ఆ తన్నిన తన్ను తననేనన్నట్టు శాస్త్రి ఎగిరిపడి "ఏం? ఏమైందీ?" అని ఒక కొత్త కేసు దొరికినట్టు నా నాడిని పరీక్షించేందుకు చెయ్యిజాపాడు. నేను చప్పున చేతిని వెనక్కులాక్కొని "రోగ్! మోసగాడు!" అన్నాను. అన్నాక, ఎందుకు తొందరపడ్డానా అనిపించింది.

"ఎవరూ?" తననే అనుకున్నట్టున్నాడు!

"శంకరంగాడు!"

"ఏం? ఏం చేశాడూ? గొలుసుకథ కాని నీకు చెప్పాడా యేం?"

ఐతే యీ గొలుసుకథ వినేందుకు నేను మొదటివాణ్ని కాదన్నమాట! నాలాగే మరికొంతమంది ఇదివరకు మోసపోయే ఉన్నారన్నమాట! నాకు తోడుగా నాతోపాటే కంఠం కలిపి ఏడ్చేందుకు మరికొందరు ఉన్నారన్నది ఒక రకంగా ఓదార్పుగా కూడావుంది.

శంకరంగాడు నాకుచెప్పిన కథంతా డాక్టర్‌కు చెప్పాను. శాస్త్రికి సస్పెన్సు యేమీ తోచలేదు. నాకన్న ముందుగానే యీ కథను విని ఉన్నాడాయె! అందులోనూ ఇది మూడోసారట! కథ మాత్రం మక్కీకి మక్కీ సరిపోయింది.

"నాకు అర్థంగాక అడుగుతాను. నువ్వు పైకం ఎలా ఇచ్చావంట? డాక్టరువై ఉండికూడా!"

"వాడి కథలో ఆ నేర్పువుంది. నాకు చెప్పిన కథలో కొద్దిమార్పుకూడా వుందిలే! అందులో వాడింకా వివాహమాడని వాడి భార్య ఇక్కడికి ఇరవై మైళ్ళ దూరంలోవున్న పల్లెటూరిలో గొలుసుకోసం కలవరపడుతూ నిమోనియాతో మృత్యువుకై ఎదురుచూస్తూ వుంది. డాక్టర్ వృత్తిలో తీరిక లేక ఛస్తున్న నన్ను రమ్మంటాడేమోననీ, అందులోనూ ఆశలన్నీ వొదులుకున్న రోగికోసం వెళ్ళటం ఎండమావి అని తెలిసివుండి కూడా దానికోసం పరుగెత్తటం లాటిదనీ ... ఎలా దూసుకుందామా అని ఆలోచించాను. కాని మహానుభావుడు గొలుసు ఖరీదు మూడు వందలూ మాత్రమే వసూలు చేసి వొదిలినందుకు తరువాత నేను పరమానందభరితుణ్నయ్యాను."

"ఐతే యీ ఒక్క గొలుసూ ఇంతవరకూ ముమ్మారు తాకట్టులోకిపోయి, ముమ్మారు లోకుల చందాల మీద విడిపించబడ్డదన్నమాట."

"మళ్ళీ తాకట్టులోకి పోదనే నమ్మకం ఏదీ?"

"ఎన్నిసార్లన్నా పోవచ్చు. మనిద్దరికీ ముందు ఎవరూ?"

"పొట్టి ప్లీడరు."

"ప్లీడరు కూడా టోపీ పడ్డాడూ! అతనికి ఎంతకు వేశాడూ?"

"వాడిలో కూడా ధర్మం ఉన్నదిరా! ఒకడికి ఎక్కువా, ఇంకోడికి తక్కువా లేదు. గొలుసు ప్రస్తుత షెడ్యూల్ రేటు మూడువందల రూపాయిలు... టాక్సులేదు!"

"వీడి యీ భార్యను నిమోనియాతో బాధపడుతూ బతకనివ్వటం మన సంఘసభ్యుల ప్రాణాన్ని తియ్యటమే! కనుక ఆమెను చంపటం మన విధి!"

"అంతవరకూ నేను చూడగలను, కాని ఇంకో భార్యను తీసుకొచ్చి ఆమెకు టైఫాయిడ్‌నూ, ఇంకా ఖరీదైన గొలుసునూ తెస్తే?" అన్నాడు శాస్త్రి.

"సరేకాని... యీ సంగతి ఇంతకు ముందు నాతో ఎందుకు చెప్పలేదూ?" అన్నాను.

"టోపీపడ్డదే కాక, ఏమని చెప్పుకోనూ? ఇప్పుడు ఇద్దరమూ వినాయకుడి బొడ్డులో వేలుపెట్టినవాళ్ళమే కనుక, మనమధ్య రహస్యం లేకుండాపోయింది.."

డాక్టర్ మౌఢ్యానికి నాకు నవ్వు వొచ్చింది... కాని నవ్వలేదు. ఎందుకంటే ఏ లోపానికైతే నేను నవ్వాలో అదేలోపం నాలోకూడా ఉందాయె. యీ గొలుసు కథ విననివాడెవడన్నా దీన్ని తెలుసుకుంటే, సానుభూతి చూపడు సరికదా... మమ్ముచూసి నవ్వుతాడు కూడాను! అందుకని చచ్చినట్టు దీన్ని జీవితరహస్యంగానే ఉంచుకోవల్సిన అవసరం ఏర్పడ్డది!

"ఏమైనా వీడు భలే కథకుడు.. ఒక్క తెలుగు కథకు మూడొందల రూపాయలు వసూలు చేశాడు!"

"అందులోనూ తెలుగు కథలంటే ఏవగించుకునే మన దగ్గర!"

"నీ లెక్కప్రకారం ముగ్గురి దగ్గర కథను అచ్చుకూడా వెయ్యకుండా నోటిమాటల్తో చెప్పి... మనకు ఏవిధమైన కష్టమూ కలగకుండా మనస్ఫూర్తిగా ఇచ్చేట్టుగా చేశాడు."

"మనకు తెలిసినంత వరకూ ముగ్గురే! మనకు ముందు కానీ, వెనుక కానీ ఇంకా ఉండి ఉంటారు. వాళ్లుకూడా క్రమంగా బైటపడతారు!"

"వీణ్ణి కథకుడు అనటంకన్న మాంచి నటకుడు అనటం మంచిది. చెప్పేప్పుడు ఎంతో మంచి సంగీతం వింటూ తన్మయత్వంలో ఉన్నట్టుగా వుంటుంది. ఆ సంగీతానికి మతిపోయి నాట్యం చేసినట్టయింది! అసలు వాడి స్వంతమో లేక ఎక్కడన్నా వల్లెవేశాడోకాని చెప్పేవిధానం మాత్రం వండర్‌ఫుల్!"

"ఏమైనా వీడు మోసగాడురా బాబూ!"

## 3

ఆ రాత్రి నిద్రపట్టే సూచనలేమీ కనిపించలేదు. మోసపుమాటల్తో స్నేహాన్ని కూడా లెక్కచెయ్యకుండా, కాల్పనిక సంఘటన (దుర్ఘటన!) సహాయంతో శంకరంగాడు డబ్బు వసూలుచేశాడనే కోపమూ, దీనికి ఏవిధంగా ప్రతీకారం తీసుకోవాలనే ఆలోచనాభారమూ వేధించసాగినయ్. అదేమొత్తం ఏ జేబుదొంగో, కన్నపుదొంగో పుచ్చుకొని ఉన్నట్టయితే యీ ఆవేదనకు దూరమయ్యేవాణ్ణి!

ఆలోచనలతో తల దిమ్మెక్కిపోయింది. ఇక ఎట్లాగూ లాభంలేదని కృత్రిమ మనశ్శాంతికోసం సినిమాకు బయలుదేరాను. దారిలో డాక్టర్ని కూడా కలుపుకొని అతని కారులోనే వెళ్ళాను.

సినిమా బుర్రకేమీ ఎక్కేట్టుగా లేదు. ఎంతసేపూ ఆ శంకరంగాడే మనస్సును పిండుతున్నాడు. వీడు నాడబ్బుతోపాటు నా మనశ్శాంతినికూడా తీసుకువెళ్ళాడుకదా!

సినిమా ఐపోయింది. కారులోనే ఇంటికి మళ్ళాం. డాక్టరు డ్రైవ్ చేస్తున్నాడు. వేగంగా వొచ్చే కారు ఒక్కసారిగా ఆగిపోయింది. ఆ కుదుపుకు నా నిద్రమత్తంతా వొదిలింది. కాస్తయితే ముందున్న అద్దాన్ని నా బుర్ర చీల్చిపారేసేది!

"ఏమిటీ?" అన్నాను..

"ఎవడో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్నాడు. కాస్తయితే కారు వాడిమీది నుంచి వెళ్ళిపొయ్యేది."

ఇద్దరమూ దిగి వెళ్ళాం. ఆ కారు లైట్లలో ఆ వ్యక్తి తప్పతాగి ఒళ్ళు తెలియని స్థితిలో పడివున్నాడని గ్రహించాం. దగ్గరకురాగానే వెంటనే వాణ్ణి శంకరంగా గుర్తించాం. ఇది తెలుసుకునేప్పటికి ఆ వ్యక్తి మీద సానుభూతి సగం తగ్గింది. కారు మీదినుంచి పోయినా బాగుండేదనిపించింది.

కానీ ఎంత చెడ్డా స్నేహితుడు! అదీకాక రక్తమాంసాల మానవ హృదయమంటూ ఉండగా వాణ్ణి ఆ స్థితిలో విడిచివెళ్ళటం అసంభవం! మోసగాడుగా ప్రవర్తించినందుకు వాడిలా చూడబడ్డాడు కాని, లేకుంటే వాడికి... ఏ ఇతర పాంథుడికి, ఏ అపరిచిత వ్యక్తికైనా జరిగే సపర్యలు జరిగేవే! ఆ అపరిచిత వ్యక్తికన్న వీడేం తక్కువ తిన్నాడూ? ఒకవేళ మే మిలా వొదిలి వెళ్ళినా, మావెనుక వొచ్చేదో, లేక మాకు ఎదురువొచ్చేదో, ఏదో వొక బండి యీ చీకటి రాత్రిని వీడి రక్తం రంగుతో తడపక మానదు.

"ఏం చేద్దాం?" అన్నాను, డాక్టర్ అభిప్రాయాన్ని తెలుసుకుందామని.

"ఇంటికి తీసుకువెళ్దాం" అన్నాడు డాక్టర్.

దీనావస్థలోవున్న మానవుడు మా ఇద్దరికీ ఒకేరకం అభిప్రాయాన్ని ఇవ్వగలిగాడు. తప్పనిసరైందని ఒకపక్క నొచ్చుకుంటూనే వాణ్ణి మెల్లిగా డాక్టర్ ఇంటికి జేర్చాం.

మనిషి స్పృహ లేకుండా పడివున్నాడు. బట్టలన్నీ దుమ్ముకొట్టుకొని ఉన్నాయ్. అలసిపోయిన ఆ ముఖంలో తనుకూడా ఒక రకం ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నాననే తృప్తి కనబరిచే వెలుగు ... ఉండి ఉండి సన్నగా సంగతి తెలియనివార్తను భయపెట్టేట్టు నవ్వే నవ్వు ద్వారా సూచిస్తున్నాడు. కళ్ళుమూతలుపడి ఉండటంవల్ల వాడి ఫీలింగు రహస్యంగా ఉండిపోయింది.

"అసలు బతుకుతాడా?" అన్నాను, యీ దుర్మార్గుణ్ని కూడా ఎలాగైనా బతికించాల్సిన బాధ్యతవున్న మానవత్వాన్ని లోలోన దూషించుకుంటూ.

"ఎందుకు బతకడూ? అరగంటలోనే బాగా తెలివి వొచ్చేస్తుంది."

నేనేమీ మాట్లాడలేదు. డాక్టర్ ఒక్కడూ ఉపచారాలు చేసి ముఖాన చన్నీళ్లు కొట్టాడు. ఇరవై నిమిషాలు గడిచేప్పటికల్లా శంకరం క్రమంగా మన లోకానికి దిగుతున్నాడు. పామును మంటల్లోంచి కాపాడి, దానికి ఉపచారాలు చేశాక దాని ప్రకృతి ప్రకారం అది పడగవిప్పుతూన్నటు శంకరం కళ్లు తెరిచి మోచేతుల మీద లేచేందుకు ప్రయత్నిస్తున్నాడు.

"ఏరా! బాగా తెలివొచ్చిందా?" అన్నాను. యీ క్షణాన మాత్రం వాడి తప్పుల్ని క్షమించగలిగినట్టుగా తోచింది.

"ఎవరూ! వెంకటేశం!" మొదట గొంతునుపట్టి కనుక్కున్నాడు. తరువాత కళ్లు తెరిచి సరిపోల్చుకున్నాడు.

వాడు బాగా తెలివికి వొచ్చాడని గ్రహించగానే వాడి ఘోరనేరం గుర్తుకొచ్చింది.

"ఆ. నేనేలే! నీ భార్యకు ఎలావుందీ?"

డాక్టర్ విరగబడి నవ్వుతున్నాడు.

"నవ్వుతున్నావురా శాస్త్రీ? నాకు భార్య లేదని నవ్వబోకండి. వొచ్చే వారంలో పెళ్ళి చేసుకుతీరుతాను!"

"చేసుకో వారాని కొకసారి నిమోనియా వస్తుంది. మళ్లీ గొలుసుపాతం గొలుసులాగే అందరికీ చెప్పవొచ్చు. కాని యీసారి గొలుసుకథ నిజంగా జరిగేను!"

"వెధవ మూడొందలు చందాలు వేశారోలేదో- శుభమా అంటూ నేను పెళ్ళి చేసుకోబోతూవుంటే... నా భార్యకు(?) నిమోనియా రావాలనా మీరు కోరేది? నేను హాయిగా రోడ్డుమీద చల్లగాలికి పడుకునివుంటే నన్నెలా వెతికి పట్టుకున్నారూ?"

"నిన్ను వెతికి పట్టుకోకపోతే ఆ చల్లగాలితోపాటు నీ శరీరంకూడా మంచుగడ్డల్లే చల్లబడేది. రోడ్డుమీద చల్లగాలే నీకు ఇష్టమైతే - తక్షణం నిన్ను ఏరుకొచ్చినచోట ఏరుకొచ్చినట్టే పడేసివాస్తా!" అన్నాను.

"కలలోకూడా గొలుసుకథ చెప్తూన్నట్టున్నాడు పాపం!" అన్నాడు డాక్టర్. పోయినడబ్బు పోనేపోయింది. ఇక మిగిలిందీ, మేము చేయగలిగిందీ తలవాచేట్టు చివాట్లుపెట్టి కొంత మనశ్శాంతి పొందటమే!

"ఏడిశార్లేవోయ్! బోడి మూడొందలకు నన్ను దూషించే అర్హత మీకు ఎక్కడిదోయ్? ఏదో యీ రాత్రి ప్రమాదాల పాలుకాకుండా నన్ను రక్షించారు కనుక మిమ్మ క్షమించాను! పోతే మాటిమాటికీ 'గొలుసు' అని వాగుతున్నారు, అదేమంత చౌకపదార్థమనుకున్నారా? మీకు ఇచ్చిన గొలుసును మళ్ళీ కొంటేనే కాని నాదెబ్బ మీకు తెలియదు. ఉండండి" అని జేబులోంచి ఒకబొత్తి కరెన్సీ నోట్లు తీశాడు. పచ్చకాగితాల్నిబట్టి నాలుగైదు వేలకు తక్కువకాని మొత్తం ఉన్నదని తెలుస్తూనేవుంది. మూడు పెద్దనోట్లు నామీదికీ, మూడు డాక్టర్ మీదికీ విసిరిపారేశాడు. వీడి ప్రజ్ఞను పూర్తిగా తెలుసుకోకుండానే వీణ్ని దూషించినందుకూ, ఇకముందు వీణ్ని తిట్టే అవకాశాలన్నిటికి నీళ్ళధార పట్టినందుకూ లోలోన నొచ్చుకున్నాను.

"ఇక మిగిలినదాంతో ఇరవై గొలుసులు కొంటాను. ఇరవైమంది పెళ్ళాలకు దిగేస్తాను. బోడి క్లబ్బు. ఇదీ వొక క్లబ్బేనా? పచ్చకాగితాలుపెట్టి పలాసు ఆడే మొగాడు ఒక్కడన్నా వున్నాడూ? ఊళ్ళో పాపర్లందరూ ఇస్త్రీ గుడ్డలు వేసుకొని తయారవగానే సరా? రెండు రోజులు ఆటలో కూర్చుంటే ఏడు వేలు... గుడ్లు మిటకరిస్తావేరా... ఇదుగో! ఏడువేలు. నువ్వు ఏడుస్తున్నట్టున్నావే!"

నా ముఖంలోని ఏడుపును వీడు గ్రహించినందుకు నాకు నిజంగా ఏడుపుగానే వుంది.

"నీ హస్తవాసి చాలమంచిదిరా వెంకటేశం!" అన్నాడు మళ్ళీ.

"లోకుల చందాలమీద పెద్దనోట్ల ఆటకు బయలుదేరావ్ లేవోయ్!" అన్నాడు డాక్టర్.

"చందాలా? మీ చందాలు మీకు పారెయ్యలా?"

"పొట్టి ప్లీడర్దో?"

"అలాటివాళ్ళు ఇంకో అరడజనుమంది ఉన్నారు. వాళ్ళ అందరితరఫునా నువ్వు వకాల్తా తీసుకున్నావా యేం? గొలుసును చాలాతక్కువ ధరకు అమ్మినందుకు విచారిస్తున్నాను. దానికి ఎంత గొప్ప డిమాండ్ వుందో గ్రహించాను. హాట్ కేక్స్‌లాగా

అమ్ముడవుతుంది. కనుక రేపటినుంచీ దాని ధర ఐదువందలు చేశామని చెప్పేందుకు కంపెనీవారు మిక్కిలి ఆనందిస్తున్నారు!"

"కొనబొయ్యే ఖాతాదారులు మిక్కిలి విచారిస్తున్నారు కూడాను!"

"కొన్నవాళ్ళు అదృష్టవంతులు. వాళ్ళకు రెండు వందలు ఊరికనే లాభంగా వొచ్చినట్టు సంతోషించవొచ్చు. ఐదేసివందల క్లాసునుచూసి వాళ్ళు ఊరట చెందవచ్చు."

"నీకూ నీ గొలుసుకూ ఒక సలాం. మళ్ళీ మా జోలికి రాకుండావుంటే అదే పదివేలు....."

"మీరు కాకపోతేనేం. క్లబ్బులో ఇంకా ఇరవైమందిని దాచి ఉంచాను. ఒక్కటి గుర్తుంచుకోండి. ఎప్పటికైనా పేకాటలోనే మజావుంది. అందులోనూ వెంకటేశంగాడి హస్తవాసి భలేమంచిది. అందుకనే వాడి డబ్బు వాడికి ఇచ్చాను. నా నెత్తి పెంకు రాల గొట్టి నేను చెమటోడ్చి సంపాయించిన యీ డబ్బును దారేపొయే వాళ్లు కాజెయ్యకుండానూ, ఏ బండికిందనో పడి ప్రాణాలు పోగొట్టుకోకుండానూ కాపాడినందుకు డాక్టర్ డబ్బును తిరిగి ఇచ్చాను. మిగతా వెధవలు కొన్నారన్నమాటే కాని, అదంతా పేకాటలోనే పోయింది. అందుకని వాళ్ళెవరికీ బోనస్ లేదు."

వాడి ఉపన్యాసానికి మేమిద్దరమూ నీరైపొయ్యాం.

"తెల్లారుతూన్నట్టుందే! ఇంకా ఎన్నో పనులున్నయ్. ముందు వివాహ సన్నాహం చేసుకోవాలి. వొస్తా్రా కాఫీకి? తల అడ్డంగా తిప్పుతున్నారా? పోనీండి మీ ఖర్మ. నేను పోతున్నాను."

జీవితానందాన్ని గూర్చిన స్వంతపాటను పాడుకుంటూ వెళ్ళిపొయ్యాడు. మా అనుమానాల మీద ఆజ్యం పోసినట్టయింది. చేసేదేమీలేక వాడు వెళ్ళిన దిక్కే శూన్యదృక్కుల్ని సారించాం.

– జూన్, *1947*